


హాస్పిటల్‌లో వరండాలో అసీజీగా పచార్లు చేస్తున్నాడు సత్యమూర్తి ఆ రోజు భార్య రోహిణి కళ్ళకు కట్టిన కట్లు విప్పుతారు ఆపరేషన్ సక్సెస్ అయిందీ లేనిదీ తెలిసిపోతుంది రోహిణికి చూపు వచ్చేదీ లేనిదీ తేలిపోతుంది

ఒకవేళ ఆపరేషన్ సక్సెస్ కాకపోతే ?

రోహిణికి చూపు రాకపోతే ?

రోహిణి శాశ్వతంగా అంధురాలయిపోతుందా!

సత్యమూర్తి గుండె ఝుళ్ళుమంది, ఆ ఆలోచనకు—

మనిషి రెస్ట్‌లెస్‌గా అయిపోయాడు.

ఎప్పుడు పిలుపు వస్తుందా, ఎప్పుడు లోపలికి వెళ్ళి రోహిణిని చూద్దామా అని తహతహగావుంది

గదిలోనుండి బయటకు వస్తూన్న డాక్టర్‌ని చూసేసరికి, సత్యమూర్తి గుండెలు దడదడలాడాయి. ఆతృతగా ఎదురు వెళ్ళాడు

అతని యాంగ్జైటీని అర్థంచేసుకున్న డాక్టర్ మందహాసం చేసాడు "యూ ఆర్ లక్కీ మిస్టర్! ఆమెకు చూపొచ్చింది" అన్నాడు

డాక్టర్ పలుకులు సత్యమూర్తిపైన అమృతపు జల్లులను కురిపించాయి మన పంతా హఠాత్తుగా దూదిపింజలా అయిపోయింది

"నిజంగానా, డాక్టర్! థాంక్యూ థాంక్యూ వెరిమచ్" అన్నాడు డాక్టర్ చేతులు పట్టుకుని ఆనందం పట్టలేక పోతున్నాడతను

"యూ కెన్ గో అండ్ సీ" అని డాక్టర్ భుజం తట్టడంతో, గదిలోకి పరుగెత్తాడు

బెడ్‌పైన కళ్ళు మూసుకుని వుంది రోహిణి ప్రక్కనే ఇద్దరు నర్సులు వున్నారు

భార్య పైకి వంగి, "రోహిణీ!" అన్నాడు

నెమ్మదిగా కళ్ళు తెరవడానికి ప్రయత్నించిందామె

ఆతృతగా చూసాడతను

కనురెప్పలు విడివడ్డాయి

"రోహిణీ! ఇలా చూడు ఇటు" అన్నాడు.

భర్తవైపు చూసిందామె

ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.

తృటికాలం భార్య కళ్ళలోకి చూసాడు సత్యమూర్తి

ఆ కళ్ళు !?

మరుక్షణంలో—

"నో, నో — ఇంపాసిబుల్ ఇట్ కాంట్ బీ" అంటూ గట్టిగా అరిచాడు

## 2

వసంత ఆ ఆఫీసులో టైపిస్టుగా చేరి మూణ్ణెల్లు అయినా, ఎవరితోనూ చేరకుండా రిజర్వ్‌డుగా వుండడం ఎవరికీ నచ్చలేదు ముఖ్యంగా ఆ ఆఫీసులో మిత్రత్రయంగా చెలామణి అవుతూన్న సత్యమూర్తి, శంకరం, రావులకు కోపం తెప్పించింది కూడా మిత్రత్రయానికి నాయకుడు సత్యమూర్తి యు డి సి గా పనిచేస్తున్నాడు పాతికేళ్ళుంటాయి. అందం మాట ఎలావున్నా, ఆడవాళ్ళను ఆకర్షించుకునే గుణం మాత్రం వుంది అతనిలో అందుకే ఆ ఆఫీసులో అతనితో చనువుగా వుండని ఆడపిల్లంటూ లేదు అయితే వసంతమాత్రం అందరికీ భిన్నంగా వుండడం అతనికి చిరాకనిపించింది ఎప్పుడయినా పలక

రించబోయినా ముక్తసరిగా జవాబిచ్చి తప్పుకుంటుందేగాని, మరో మాటకు తావిచ్చేదికాదు.

"నాన్సెన్స్, దానికెంత తల బిరుసో! ఉదయం నేను కాఫీ ఆఫర్‌చేస్తే తీసుకుందికాదు" అన్నాడు రావ్.

"మరీ పొగరుబోతులా వుందిరా భాయ్! నవ్వించినా నవ్వడంలేదు" అన్నాడు శంకరం.

"ఆ పిల్ల పొగరణచాలంటే మనవాడివల్లే అవుతుంది. ఏమంటావురా, బ్రదర్?" అన్నాడు రావ్, సత్యమూర్తి నుద్దేశించి.

సత్యమూర్తి ఆలోచిస్తున్నాడు. స్వతహాగా అతను చెడ్డవాడు కాదు. ఆ మాటకొస్తే మిత్రత్రయం మంచిదే. ఇన్నాళ్ళయినా వాళ్ళకు 'దుష్టత్రయం' అన్న బిరుదు రాకపోవడమే అందుకు నిదర్శనం. కాకుంటే ఆడవాళ్ళను ఆకర్షించుకోవాలనీ, వాళ్ళతో చనువుగా మెలగాలనీ, అది చూసి ఇతరులు అసూయ చెందాలనీ — ఇటువంటి ఆశ(యా)లేవో తప్పితే, ఆడవాళ్ళకు చెడుపు చేయాలన్న దురుద్దేశం వాళ్ళకున్నట్లు కనిపించదు. ఎలాగైనా వసంతను తమ పరిధిలోనికి తీసుకురావాలన్న పట్టుదల పెరిగింది వాళ్ళలో.

"ఒరేయ్, భాయ్! మనతో నోరు విప్పి మాట్లాడితేనే మైలపడిపోతానన్నట్లు ప్రవర్తిస్తోందిరా వసంత. ఆవిడ పొగరణిచి మన బృందం పరువు నిలుపుతావో, లేక మనం తిరుపతి వెళ్ళకుండానే గుళ్ళు కొట్టించుకోవాలో — నిర్ణయించవలసింది నువ్వేరా భాయ్!" అన్నాడు శంకరం, సత్యమూర్తితో.

సాలోచనగా తల పంకించాడు సత్యమూర్తి. అతన్ని ఏదో ఆవహించినట్లయింది.

"మనతో మాట్లాడితేనే మైలపడిపోతాననుకుంటోంది కదూ! ముద్దు పెట్టుకుంటే ఏమవుతుందో చూస్తాను" అన్నాడు.

అనుకోవడమేమిటి, ఆచరణలో పెట్టడమేమిటి ఇట్టే జరిగిపోయాయి.

వసంత పెద్ద అందగత్తెకాదు. కాని, పరువం తెచ్చిన అందాలతో ఆకర్షణీయంగా వుంటుంది. నల్లగా, వెడల్పుగా వుంటే పెద్దకళ్ళు.... సరళస్వభావము... అందరినీ ఇట్టే ఆకర్షించుకుంటాయి. తన పనేదో తాను తల వంచుకుని చేసుకుపోవడమే కాని, ఇతర స్త్రీలతో కలిసి కబుర్లుచెబుతూ కూర్చోవడం కాని, వాళ్ళలా ఇతరులను గూర్చి కామెంట్ చేయడంకాని చేయదు.

ఆవేళ సాయంత్రం ఇంటికి బయలుదేరిన వసంత తలవంచుకుని నడుస్తోంది. అప్పటికే స్టాఫ్ చాలామంది వెళ్ళిపోయారు.

ఎక్కడినుంచి వచ్చాడో, హడావుడిగా వచ్చిన సత్యమూర్తి వసంతను

ఢీకొట్టాడు. ఆమె క్రిందపడకుండా రెండు చేతులతో వాటేసి పట్టుకుని గట్టిగా హృదయానికి హత్తుకున్నాడు. అది చాలదన్నట్లు ఆమె పెదవులపైన గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

ఎక్కడినుండి చూస్తున్నారో, ఈల వేసి చప్పెట్లు కొట్టారు శంకరం, రావ్‌లు.

ఆ హఠాత్సంఘటనకు నిర్ఘాంత పోయిన వసంత చప్పెట్లతో తేరుకుంది. సత్యమూర్తి చెంపమీద సాచిపెట్టి వాయించి, బలంగా వెనక్కి గెంటేసింది.

సమీపంలో వున్న స్టాఫ్ కొందరు ఆశ్చర్యంగాచూసి ఫకాలున నవ్వారు, 'వెల్‌డన్' అంటూ.

"బ్రూట్!" అంటూ ఛీత్కరించుకుని, అదిరే గుండెలను అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ వడివడిగా బయటకు నడిచింది వసంత.

సత్యమూర్తికి తల కొట్టేసినంత పనయింది....

## 3

రోహిణి హాస్పిటల్ నుండి ఇంటికి వచ్చేసింది.... కొన్నాళ్ళపాటు ఆమె పూర్తిగా బెడ్‌రెస్ట్ తీసుకోవాలని చెప్పాడు డాక్టర్.

భార్యకు పోయిన చూపు వచ్చినందుకు సంతోషించాలో, విచారించాలో తెలియలేదు సత్యమూర్తికి. ఆమె కళ్ళలోకి చూడలేకపోతున్నాడతను. ఆమె చూపులతో చూపులు కలపలేక పోతున్నాడు.

ఆ కళ్ళు....!!

అవే కళ్ళు!

అవే చూపులు!!

ఆ కళ్ళు రోహిణికి ఎలా వచ్చాయ్??

నో, ఇటీజ్ అబ్‌సర్డ్!

తనకు ఫెమిలియర్ అయిన ఆ కళ్ళు....

అనునిత్యము తనను కాల్చివేసే ఆ చూపులు....

అందులో సందేహంలేదు. తాను పొరబడడంలేదు.

కాని.... కాని.... అదెలా సంభవం??

ఆలోచనలతో సత్యమూర్తి తల పగిలిపోతోంది.

## 4

....ఆ సంఘటన జరిగిన మరుసటి రెండురోజులూ వసంత ఆఫీకు రాలేదు. మూడవరోజున మామూలుగా వచ్చి తలవంచుకుని తనపని తాను చేసుకుపోయింది.

రెండురోజులు రాకపోవడంతో టైప్ చేయవలసిన మాటర్ అలాగే పడివుంది. దానికితోడు అర్జెంటుగా చేయవలసిన స్టేట్‌మెంట్సు ఏవో వున్నాయి. ఫలితంగా ఆవేళ సాయంత్రం ఆలస్యంగా కూర్చోవలసి వచ్చిందామె.

రాత్రి ఏడుగంటలవరకు పైపుచేసి, ఇక ఇంటికి వెళ్ళటానికి బయలుదేరింది. ఆఫీసు విడిచిపెట్టేముందు బాత్‌రూంకి వెళ్ళి ముఖం కడుక్కొని రావటం అల వాటు. అలవాటు ప్రకారం బాత్‌రూంకి వెళ్ళి తలుపు వేసుకుంది. చల్లనినీళ్ళతో ముఖం కడుక్కొనేసరికి అలసట కొద్దిగా తగ్గినట్లనిపించింది. కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూన్న వసంత, అద్దంలో కనిపించిన రూపాన్ని చూసి అదిరిపడి, గిర్రుని వెనక్కు తిరిగింది.

అదోలా నవ్వాడు సత్యమూర్తి, రెండుచేతులతో ఆమె భుజాలు పట్టుకుని ఆమెను తన ఛాతీకి అదుముకుంటూ.

"ఛీ, వదులు...." అంటూ పెనుగులాడిందామె.

"వదలను. ఆవేళ నువ్వు నాకుచేసిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంటాను- నీ యవ్వనాన్ని అనుభవించి నీ పొగరణుస్తాను" అన్నాడు కటువుగా.

అతని ప్రతి పలుకులో ధ్వనిస్తోన్న దృఢనిశ్చయాన్ని గ్రహించి కలవరపడి పోయింది వసంత. ఏంచేయాలో పాలుపోలేదు. అతని పట్టు విడిపించుకునేందుకు పెనుగులాడింది. గుప్పెళ్ళతో అతని ఛాతీమీద బాదింది. ఏమన్నా, ఏం చేసినా ప్రయోజనం లేకపోయింది.

గండు తుమ్మెద మొండి బలాన్ని సుమబాల ఎంతసేపని తట్టుకోగలదు? వసంత ప్రతిఘటించి అలిసిపోయింది....

ఆమె యవ్వనాన్ని బలిగొన్న సత్యమూర్తి విజయోత్సాహంతో లేచాడు.

వెక్కి-వెక్కి ఏడుస్తోందామె.

"ఇప్పటికైనా గ్రహించావా, నీపొగరుకు ఫలితమేమిటో?" అన్నాడతను.

చివుక్కున తలయెత్తి తీక్షణంగా చూసింది వసంత. ఆమె కళ్ళలో విస్ఫులింగాలు ప్రజ్వరిల్లాయి. ఆమె చూపులకే శక్తివుంటే సత్యమూర్తేకాదు, ఈ జగత్తే భస్మీపటలమై వుండేది.

ఆమె కళ్ళనుచూసి భయపడ్డాడతను. ఆమె చూపులతన్ని కాల్చివేస్తున్నాయి.

"నీచుడా! నా జీవితం నాశనం చేశానని సంతోషించకు. ఈ పాపం నిన్ను జీవితాంతం వెన్నాడుతుంది. నీకు నెమ్మది లేకుండా చేస్తుంది. నీకు మనసంటూ వుంటే శాంతిలేకుండా పోతుంది. అసహాయతతో ఒక నీచుడి అక్రమానికి బలయిపోయిన యువతి శాపం నీకు తప్పక తగులుతుంది—"

మళ్ళా ఆమె కళ్ళలోకి చూడాలంటే భయంవేసింది సత్యమూర్తికి.

"హుఁ-" అంటూ నిర్లక్ష్యంగా బయటకు నడిచాడు.

ముఖం చేతుల్లో కప్పుకొని భోరుమంది వసంత—

## 5

హాస్పిటల్‌నుండి వచ్చినప్పటినుండీ

భర్త ప్రవర్తనలో వచ్చిన మార్పును గమనిస్తూనేవుంది రోహిణి. అదేమిటో గ్రహించలేక, కారణం వూహించలేక సతమతవుతుతోంది. యాక్సిడెంట్ లో పోయిన తన చూపు తిరిగి వచ్చినందుకు సంతోషించవలసిందిపోయి, అతనెందు కలా తననుతప్పించుకు తిరుగుతున్నాడో బోధపడలేదు.

తప్పనిసరిగా తనతో మాట్లాడవలసి వచ్చినా, ఎటోచూస్తూ మాట్లాడుతాడు. తన ముఖంలోకి చూడడం మానివేశాడు.

ఎందుకు ? అతని కేమయింది ? తన ముఖం అంత వికృతంగా కనిపిస్తోందా??

తనకు చూపువచ్చాక తనభర్త తనకు దూరమవుతున్నాడన్న మానసిక వేదన భరించలేకపోయింది రోహిణి.

ఆవేళ భర్తను నిలదీసింది.

"ఏమండీ ! హాస్పిటల్ నుండి తిరిగి వచ్చినప్పటినుండీ చూస్తున్నాను మీ వరస....ఎందుకూ నాముఖం చూడడమే పాపమన్నట్లు ప్రవర్తిస్తున్నారు ?ఎందుకు నన్ను తప్పించుకు తిరుగుతున్నారు ? నేనేం పాపం చేశానని ? .పోనీ, నాకు చూపురావటం మీకిష్టంలేకపోతేచెప్పండి. ఇప్పుడే ఈ కళ్ళను పొడిచేసుకుంటాను. జీవితాంతం అంధురాలిగా వుండిపోతాను కాని, నాకుమాత్రం మీ ప్రేమను దూరం చేయకండీ !" అంటూ వా పో యిం ది రోహిణి.

ఏం చెప్పాలో, ఆమె నెలా వోదార్చాలో తోచలేదు సత్యమూర్తికి.

తన పాపపు కృత్యం ఆమె కెలా తెలిపేది!

ఒక అమాయకురాలి జీవితాన్ని నాశనం చేసాడని చెప్పాలా?

ఆ అభాగ్యురాలు పెట్టిన శాపం రూపందాల్చిందని చెప్పాలా?

వసంత కళ్ళు తన్ను వెంటాడి, వేటాడుతున్నాయని చెప్పాలా?

వసంత చూపులు తన గుండెల్ని చీల్చివేస్తున్నాయనీ, తన్ను నిలువునా కాల్చివేస్తు న్నాయనీ చెప్పాలా?

తన మానసిక దుస్థితి ఎలా చెబితే ఆమె కర్థమవుతుంది!

ప్రేమగా భార్య తల నిమిరాడు సత్యమూర్తి.

"ఏడవకు రోహిణీ! ఏడిస్తే కళ్ళు దెబ్బతింటాయనీ, కొన్నాళ్ళపాటు కళ్ళకు స్ట్రెయిన్ కలిగించకూడదనీ డాక్టర్ చెప్పలేదూ?.... అయినా ఇప్పు డేమయిందని, అలా బాధ పడిపోతు న్నావు? ఏవేవో వూహించుకుని నీ ఆరోగ్యం చెడగొట్టుకోకు" అన్నాడు.

భర్త గుండెల్లో ముఖం దాచుకుని ఏడ్చింది రోహిణి.

## 6

....ఆవేశంలో ఏదో చేసినా, ఆ తరువాత తాను చేసిన పని ఎంత ఘోర

మైనదో గ్రహించిన సత్యమూర్తికి మనస్సాక్షి ఎదురు తిరిగింది. అన్యాయంగా ఒక ఆడపిల్ల శీలాన్ని చెరిచానే అన్న బాధ ఒక ప్రక్క, వసంత ఆఫీసులో తనపైన కంప్లెయింట్ ఇస్తే తన వుద్యోగం ఏమవుతుందో నన్న భయం మరో ప్రక్క పెనవేసుకున్నాయి అతన్ని. ఆఫీసుకు వారం రోజులు సెలవు పెట్టేసాడు వంట్లో బావుండ లేదని.

వసంత కూడా వారంరోజులు సెలవు పెట్టిందనీ, ఆఫీసులో కంప్లెయింట్ ఇవ్వలేదనీ తెలుసుకున్న సత్యమూర్తి విస్తుపోయాడు. తాను చేసిన పాపం అనుక్షణం నిలదీస్తూంటే, ఎదురు తిరిగిన మనసు రంపపు కోత కోస్తూంటే నాలుగైదు రోజులు వీధి మొహమే చూడలేదతను.... వసంత చూసిన చూపులు, నిప్పులు చెరుగుతూన్న ఆమె కళ్ళు పదే పదే గుర్తుకొస్తూ వెన్నాడుతూంటే మనసుకు నెమ్మదిలేకుండా పోయింది. ఆ కళ్ళను మరిచిపోలేక పోతున్నాడు. స్వతహాగా మంచివాడేమో, ఆవేశానికి బానిస అయి అనాలోచితంగా ఒక యువతి నిండుజీవితం నాశనం చేసానే అన్న తలంపు పామై నాల్కలు చాపుతూ కాటువేస్తూంటే, కంటిపైన కునుకుకూడా సరిగా పట్టడంలేదతనికి.

చివరకేదో నిశ్చయానికి వచ్చిన వాడిలా గదికి తాళంవేసి బయలుదేరాడు.

సత్యమూర్తి వెళ్ళేసరికి వసంత ఇంటిదగ్గరే వుంది. అతన్ని చూడగానే ఆమె కన్నులు అగ్నిగోళాలయ్యాయి.

"ఇంకా ఏం మిగిలివుందని మళ్ళా ఇక్కడకు దాపురించావు?" అంది కఠినంగా.

ఆమె ముఖం చూళ్ళేక పోతున్నాడతను.

"నన్ను క్షమించు, వసంతా! ఎందుకలా చేసానో నాకే తెలియదు.... చేసిన తప్పుకు పశ్చాత్తాప పడుతున్నాను" అన్నాడు తల వంచుకుని.

పంటితో పెదవి కొరుక్కుంటూ వస్తూన్న దుఃఖాన్ని బలవంతగా ఆపుకుంటూ అంది వసంత - "పశ్చాత్తాపంతో నువ్వు నీ పాపాన్ని కడిగేసుకోవచ్చును. కాని.... కాని.... బండలయిన నా బ్రతుకు - మళ్ళా ఎలా బాగుపడుతుంది? నేను నీకేం అపచారం చేసానని నాకింత అన్యాయం తలపెట్టావ్?"

"దురదృష్టవశాత్తూ ఇలా జరిగిపోయింది. అందుకు నువ్వే శిక్ష విధించినా అనుభవించడానికి నేను సిద్ధమే..."

"హుఁ, నిన్ను శిక్షించడం వలన నా కొరిగేదేమిటి? అపవిత్రమైన నాశీలం మళ్ళీ పవిత్రం కాదుగా!"

"వసంతా! నా మూలంగా నీ జీవితం నాశనంకావడానికి వీల్లేదు. నిన్ను నేను వివాహం చేసుకుంటాను" అన్నాడు సత్యమూర్తి కించిత్తు ఆవేశంగా.

"ఛీ, నీవంటి నీచుడికి భార్య అయ్యే కంటె చావటం మేలు!"

"వసంతా !"

"చావాలనుకున్నదాన్నే కాని, మా అమ్మను దిక్కులేనిదాన్ని చేయ లేక ఇంతటి అవమానాన్ని భరించి ఇంకా మొండిగా బ్రతుకుతున్నాను."

"వసంతా! ప్లీజ్ ఇప్పుడు నీ కొచ్చిన నష్టమేమీ లేదు నిన్ను పెళ్లాడు తాను నేను చేసిన పొరపాటును సరి దిద్దుకుంటాను " అన్నాడతను.

"అయాంసారీ, మిస్టర్! ఆడదంటే మగవాడు ఆడించినట్లల్లా ఆడే మర బొమ్మకాదు మనసున్న మనిషి! నువ్వు పెళ్ళిచేసుకుంటాననగానే నీ నీచత్వాన్ని మరిచిపోయి పొంగిపోతా ననుకోకు. నిన్ను చచ్చినా పెళ్ళాడను " దృఢంగా అంది వసంత.

"వసంతా! నామీద కోపంతో నీ జీవితం నాశనం చేసుకోకు ప్లీజ్, ఆలోచించు " ప్రాధేయపడ్డాడు సత్య మూర్తి

"నే నేమయిపోయినా పరవాలేదు కాని, పశువులా బలాత్కరించిన నిన్ను భర్తగా చూడలేను దయచేసి ఇక్కడి నుండివెళ్ళిపో!" అంటూ తలుపు వేసేసు కుంది వసంత.

## 7

ఎదురుచూసిన దానికంటె త్వరగానే కోలుకుంది రోహిణి. కాని, ఆమె మన సులో భర్తను గూర్చిన బెంగ అలాగే వుంది.


సత్యమూర్తి నానాటికీ మానసికం గాను, శారీరకంగానూ నీరసించిపోతు న్నాడు. అతనిలో మార్పు కొట్టవచ్చి నట్లు కనిపిస్తోంది. రోహిణిని చూస్తేనే వులికిపడే స్థితికి వచ్చాడు

అనుక్షణం వసంత పలుకులే గుర్తు కొస్తున్నాయి—

'నీచుడా! నా జీవితం నాశనం చేసా నని సంతోషించకు. ఈ పాపం నిన్ను జీవితాంతం వెన్నాడుతుంది నీకు నెమ్మదిలేకుండా చేస్తుంది. నీకు మన సంటూ వుంటే శాంతిలేకుండా పోతుంది. అసహాయతతో ఒక నీచుడి కామాం ధతకు బలయిపోయిన యువతి శాపం నీకు తప్పక తగులుతుంది !

రోహిణి చూపులు ఎంత ప్రస న్నంగా వున్నా, అతనికి మాత్రం తీక్షవీక్షణాలలా తోచి అప్‌సెట్ చేస్తు న్నాయి. వసంతశాపం ఫలించుతోందన్న భావం బలంగా ఏర్పడిపోయిం దతనిలో ఎంత ధీమాగా వుండా లన్నా, ఎంత నిభాయించుకుందామన్నా అతనివల్ల కావడంలేదు. రోహిణి కళ్ళు వసంత కళ్ళలా ఎందుకు కనిపిస్తున్నాయో వూహాతీతంగా వున్నదతనికి.

ఆ వేళ తమ పెళ్ళిరోజంటూ పాయసం, వడలూ తెచ్చి అతని ముందుంచింది రోహిణి. తమ రెండేళ్ళ



దాంపత్య జీవితంలోని విశేషాలను ముచ్చటించుకుంటూ తిన్నారిద్దరూ

భర్త వొళ్ళో పడుకుని, "ఏమండీ! నేను శాశ్వతంగా గ్రుడ్డిదాన్నయిపోతా నని ఎంత భయపడ్డానో తెలుసా? మీ అందమైన వదనాన్ని చూసుకునే అదృష్టం నాకింకా వుండబట్టి ఈ క్రొత్త కళ్ళు దొరికాయి నాకు" అంది రోహిణి.

ఊ కొడుతూన్న సత్యమూర్తి అప్రయత్నంగా ఆమె కళ్ళలోకి చూసాడు

నల్లగా, వెడల్పుగా, అందంగా వున్నాయి ఆమె కన్నులు

దొండపండులాంటి ఆమె అధరాలు నవ్వుతున్నాయి.

కాని—

ఆ కళ్ళు — కాంతిని వెదజల్లుతూ, తీక్షణంగా చూస్తున్నాయి అతని వంక!

ఉలిక్కిపడ్డాడు సత్యమూర్తి.

ఆ కళ్ళు !

వసంత కళ్ళు !!

చూశ్శేకపోయాడు.

మెదడు చెదిరిపోయినట్లయింది.

"ఒద్దు అలా చూడకు వసంతా! ప్లీజ్ " అని అరుస్తూ వెనక్కి విరుచుకుపడిపోయాడు.

## 8

వారంరోజుల సెలవు నెల్లాళ్ళకు పొడిగించిన సత్యమూర్తి, సెలవు పూర్తయేసరికి దూరంగా వున్న మరో వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళిపోయాడు అప్పుడప్పుడు తాను చేసిన పాపం జ్ఞాపకమొచ్చి మనసును అల్లకల్లోలం చేసేది వసంత కళ్ళు, ఆమె తీవ్రదృక్కులు వెంటాడి వేధించేవి. మనశ్శాంతి లేకుండా చేసేవి

ఏడాది తిరక్కుండానే అతనకి పెళ్ళయింది భార్య రోహిణి అందగత్తె. ఆమె సాహచర్యంలో వసంత విషయం మరిచిపోవడానికి ప్రయత్నించేవాడు.

పెళ్ళయి ఏడాది గడిచిపోయింది వసంత జ్ఞాపకాలు క్రమంగా మెదడు యొక్క అడుగు పొరల్లోకి దిగబడిపోసాగాయి.

తల్లికి అనారోగ్యంగా వుందని చూడడానికి పుట్టింటికి వెళ్ళింది రోహిణి సత్యమూర్తికి సెలవు దొరకలేదని భార్యను ఒక్కర్తెనూ పంపించాడు వూరికి. వారం రోజులు వుండి తిరుగు ప్రయాణం కట్టింది రోహిణి.

అదే రైల్లో, అదే కంపార్ట్‌మెంటులో ప్రయాణం చేస్తోంది వసంత కూడా

తనకు జరిగిన పరాభవానికి చాన్నాళ్ళు కుమిలిపోయింది వసంత తన బ్రతుకు పైన, శరీరంపైన తనకే రోత కలుగసాగింది అటువంటి మలినమైన జీవితం వెళ్ళబుచ్చేకంటె, చచ్చిపోవడం మేలని ఎన్నోసార్లు అనుకుంది కాని, ముసలి తల్లిని దిక్కుమాలినదాన్ని చేయడానికి మనసొప్పక చావాలన్న కోర్కెను చంపుకునేది. జీవచ్ఛవంలా గడుపుతోంది జీవితంలో తాను పెళ్ళాడదమన్నది వట్టిమాట! కనీసం తల్లి జీవించి వున్నంత వరకైనా వుద్యోగం చేయాలి

ఉన్నట్లుండి, ఉన్న ఒక్క ఆధారము కూలిపోవడంతో తల్లి చనిపోవడంతో- అంతవరకు కూడదీసుకున్న ధైర్యం

సడలిపోయింది వసంతలో తల్లి శవం మీదపడి భోరున ఏడ్చింది తానెవరి కొరకు జీవించాలన్న ప్రశ్న తల ఎత్తింది.

తల్లి అస్థికలను కృష్ణలో కలిపి తిరిగి వస్తూన్న వసంతకు, రోహిణితో పరిచయమయింది రైల్లో ఆ స్వల్ప వ్యవధిలోనే ఇద్దరూ ఇట్టే స్నేహితులయిపోయారు

"వసంతా! నల్లగా, వెడల్పుగా వున్న నీ కళ్ళు చూస్తూంటే యెంత ముద్దొస్తున్నాయో తెలుసా?" అంది రోహిణి నవ్వుతూ

"అలాగా! పోనీ, నాకళ్ళు తీసుకుని మీరు పెట్టేసుకోరాదూ?" అంటూ నవ్వింది వసంత రోహిణితో మాట్లాడుతున్నంతసేపూ తన కష్టాన్ని మరిచిపోయిందామె

అలా కబుర్లు చెప్పుకుంటూ నిద్రపోయిన స్నేహితురాళ్ళిద్దరూ, అర్ధరాత్రి పెద్ద కుదుపుతో ఎక్కడికో ఎగిరిపడ్డప్పుడు కానీ మెలుకువ రాలేదు కాని, ఏం జరిగిందో తెలుసుకొనే స్పృహ కోల్పోయారు

అది నాన్‌స్టాప్ స్టేషను కావడంతో వేగాన్ని పెంచి, అంతవరకు గూడ్సు బండిలా నడిచినది కాస్తా రియల్ ఎక్స్‌ప్రెస్ అయిపోయి దూసుకుపోతూన్న ఎక్స్‌ప్రెస్, అదే లైనుమీద నిలుచున్న గూడ్సు ట్రెయిన్‌ను గుద్దుకుంది. సెకన్లలో పరిస్థితి అల్లకల్లోల మయిపోయింది పరిసరాలు హాహాకారాలతో మార్మోగాయి. ప్రాణాలుపోయినవాళ్ళు

పోతూవున్నవాళ్ళు బాధ భరించలేక ప్రాణాలు పోతేబాగుండునని విలపించేవాళ్ళు తీవ్రంగా గాయపడినవాళ్ళూ తల్లికోసం పిల్లా పిల్లకోసం తల్లీ భర్తకోసం భార్య భార్యకోసం భర్తా ఆక్రందనలతో, ఆర్తనాదాలతో, ఆందోళనలతో వాతావరణం బీభత్సంగా తయారయింది

రోహిణికి కళ్ళుపోయాయి

వసంత చావుబ్రతుకుల్లో వుంది

తానిక ఎలాగూ జీవించనని గ్రహించిన వసంతకు మనసు తేలికపడింది తల్లిలేని లోకంలో వొంటరిగా బాధపడకుండా భగవంతుడు తనకు మేలుచేశాడని సంతోషించింది పోతూపోతూ తన నేత్రాలను డొనేట్‌చేసి మరీ మరణించింది

రోహిణి, వసంతల కలయికే ఒక యాక్సిడెంట్ అనుకుంటే-వసంత కళ్ళు అంధురాలైన రోహిణికి అమర్చబడటం పెద్ద యాక్సిడెంట్ అని చెప్పాలి రోహిణి ఎవరో వసంతకు తెలియదు వసంత ఎవరో రోహిణి ఎరుగదు కొన్ని పరిచయాలు, పలుకులు దైవికంగా జరుగుతాయనడానికి వాళ్ళే నిదర్శనం తనకళ్ళు అందంగా వున్నాయంటే, రోహిణినే తీసేసుకోమంది

వసంత. అది అక్షరాలా జరుగుతుందని వాళ్ళు వూహించి వుండరు!

అదృష్టవశాత్తూ 'ఐ-ట్రాన్స్‌ప్లాంటేషన్' విజయవంతంగా జరిగింది

## 9

సత్యమూర్తి మానసికంగా బాగా దెబ్బతినటంతో మంచం పట్టాడు. పిచ్చివాడిలా తనలోతానే మాట్లాడుకుంటాడు. అతని పలుకులకు అర్థం బోధపడని రోహిణి, భర్తస్థితికి తల్లడిల్లిపోయింది. ఆందోళన చెందింది.

డాక్టరు మందులిస్తున్నాడు. కానీ, మందులదారి మందులదే అవుతోంది అతన్నేదో మానసిక రుగ్మత ఆవరించుకున్నదనీ, అదేమిటో తెలుసుకుంటే తప్ప వైద్యం పనిచేయదనీ అన్నాడు డాక్టర్.

అదేమిటో తనకే తెలియని రోహిణి డాక్టరుకేం చెబుతుంది.

రాత్రింబవళ్ళు దగ్గరవుండి కంటికి రెప్పలా భర్తను చూసుకుంటోంది రోహిణి అమె చెంతనున్నంత సేపూ కళ్ళు తెరవటంలేదు సత్యమూర్తి. ఆమె వంక చూడాలంటేనే భయపడుతున్నాడు

అంతవరకూ మెలకువగావున్న రోహిణి, ఆరోజు రాత్రి పదకొండు దాటేసరికి భర్త బెడ్ ప్రక్కనే కుర్చీలో కూర్చుని నిద్రపోయింది

సత్యమూర్తికి ఎందుకో మెలకువ వచ్చింది. గదిలో నైట్‌లాంపు వెలుగుతోంది.

కుర్చీలో నిద్రపోతూన్న భార్యను చూసేసరికి జాలివేసిందతనికి. ఆమెకు అన్యాయం చేస్తున్నాననుకున్నాడు. కాని తన మానసిక స్థితి ఏమిటో తనకేతెలియదాయె!

మెల్లగాలేచి కూర్చున్నాడు. చప్పుడు కాకుండా మంచం దిగాడు. ఎందుకు లేచాడో, ఎక్కడకు వెళుతున్నాడో తనకే తెలియదు!

కొంతసేపటికి హఠాత్తుగా మెలకువ వచ్చింది రోహిణికి. మంచం ఖాళీగా కనిపించడంతో గుండె ఝల్లుమంది.


'ఆయనెక్కడికి వెళ్ళినట్టు?' అనుకుంటూ కంగారుగా లేచింది బాత్‌రూంకి వెళ్ళి వుంటాడనుకుంది! ఎక్కడ కళ్ళుతిరిగి పడిపోతాడోనని అటువైపు వెళ్ళింది.

భర్త బాత్‌రూంలో కనిపించకపోయేసరికి ఆమె కంగారు అధికమయింది. ఆందోళనతో ఇల్లంతా వెదికింది ఎక్కడా కనిపించలేదతను. తలుపులు వేసినవి వేసినట్లే వున్నాయి.

డాబామీదకు వెళ్ళింది.

పైన పౌర్ణమి చంద్రుడు జగమంతా తెల్లరంగు పూసాడు.

వెన్నెలలో డాబాపైన నిలుచుని ఎటో చూస్తోన్న భర్త కనిపించగా తేలికగా నిట్టూర్చింది రోహిణి.



"ఈ వేళప్పుడు మీరు ఇక్కడి కెందుకు వచ్చారు ?" అంది మృదువుగా, మందలింపుగా.

భార్యపలుకులకు త్రుళ్ళిపడివెనక్కి తిరిగాడు సత్యమూర్తి

రోహిణి స్థానంలో-వసంత ప్రత్యక్ష మయింది !

నవ్వుతూన్న రోహిణి కళ్ళు విస్ఫులింగాలను వెదజల్లుతూన్న వసంత కళ్ళుగా మారిపోయాయి !!

అంతే !—

"ఒద్దు ఈ చిత్రవధ నేను భరించ లేను-ప్లీజ్ వసంతా ! నన్ను క్షమించు నన్ను క్షమించు, వసంతా !" అని అరుస్తూ వెనక్కి అడుగులు వేశాడు.

"ఏమండీ ! ఏమిటది ? ఆగండి— వెనుక గోడవుంది ఆ గ ం డీ— ఏమండీ !" అంటూ ఆందోళనగా అతని వైపు వెళ్ళింది రోహిణి

ఆమె సమీపించేకొద్దీ వెనక్కి జరిగాడు సత్యమూర్తి.

ఆమె ఆందోళనతో హెచ్చరిస్తూనే వుంది

అతను తన కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకుంటూ వెనకకు వెళతూనే ఉన్నాడు

"నో, నో లీవ్ మీ అలోన్ "

అంటూ చివరకు చేరుకున్న సత్యమూర్తి డాబా పైనుండి క్రిందికి పడిపోయాడు. రోహిణి కెవ్వున అరిచి స్పృహతప్పి పడిపోయింది.